సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ; 16 ; మార్చి ; 2025



వేసవిలో వేటగాళ్ల ముప్పు

వేసవి కాలంలో ఆహారం, తాగునీటి కోసం జనావాసాల వైపునకు వస్తున్న వన్యప్రాణులు వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం సా॥) 6.25

సహర్ (సోమవారం ఉ॥) 4.59

వాతావరణం

గరిష్టం / కనిష్టం 39° / 21°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఉదయం మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని కృష్ణా జిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్–సౌజన్య దంపతులు రూ.లక్ష చెక్కు ఆలయ అధికారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఆలయ పీఆర్వో సాయిబాబు తదతరులు పాల్గొన్నారు. కాగా, ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ దండా శ్రీనివాస్–లక్ష్మితాయారు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారి వెంట అధికారులు నెల్లూరు సింధు, ఉమామహేశ్వరరావు, ప్రియాంక, రాంజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సుబ్బారావు ఉన్నారు.

రేపటి నుంచి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

భద్రాచలంటౌన్: జిల్లాలోని చంద్రుగొండ, అశ్వారావుపేట మండలాల్లో ఈ నెల 17, 18 తేదీల్లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ పర్యటించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం చంద్రుగొండ మండలం సీతాయిగూడెం ప్రాజెక్టును సందర్శిస్తారని, ఆ తర్వాత చంద్రుకుంట గ్రామంలోని గిరిజనుల పోడు భూములను పరిశీలించి రైతులతో సమావేశం అవుతారని వివరించారు. సాయంత్రం పెదవాగు ప్రాజెక్ట్ సందర్శించి రాత్రికి అశ్వారావుపేటలో బస చేస్తారని తెలిపారు. 18వ తేదీ ఉదయం పండువారిగూడెం, గాండ్లగూడెం, కావడి గుండాల గ్రామాల్లో గిరిజన సంఘాల నాయకులతో జరిగే సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలను సందర్శిస్తారని తెలిపారు. సంబంధిత తహసీల్దార్లు, ఇరిగేషన్, ఐటీడీఏ అధికారులు ఈ పర్యటనలో పాల్గొనాలని సూచించారు.

పెదవాగును పరిశీలించిన అధికారులు..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద గల పెదవాగు ప్రాజెక్ట్‌ను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ సందర్శించనున్న నేపథ్యంలో ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాస్, సీఐ కరుణాకర్, ఎస్సై యయాతిరాజు శనివారం పరిశీలించారు. గతేడాది జూలై 18న కురిసిన భారీ వర్షం, వరదతో ప్రాజెక్ట్ ప్రధాన ఆనకట్టకు గండ్లు పడిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ఇటీవల మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లగా, కమిషన్ సభ్యుల బృందం ప్రాజెక్టు వద్దకు రానున్నారు.

‘గూడెం’ వాసికి సాహిత్య రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న సదానందం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 8వ వార్డుకు చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి జినుకల సదానందానికి సాహిత్య రత్న అవార్డు లభించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తీరా అర్ట్స్ ఆకాడమీ వారు సాంస్కృతిక, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందించారు. కాగా, కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 ఇంక్‌లైన్ గనిలో సుమారు 35 సంవత్సరాలు పనిచేసిన సదానందం.. సంస్థ అభివృద్ధికి కృషి చేయడమే కాక తన కథలు, కవితలు, నాటికలతో కార్మికులను చైతన్యపరిచారు. కోలిండియా స్థాయిలోనూ అనేక ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు సాధించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం శాలేంరాజు సదానందాన్ని అభినందించారు.

ఈ నవమికీ ఇక్కట్లేనా..?



ఏళ్లుగా నిర్మాణం పూర్తికాని హరిత కన్వెన్షన్ హాల్

భక్తులకు సరిపడా లేని వసతి సౌకర్యాలు

- పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హోటల్, కాటేజీల నిర్మాణం
- పదేళ్ల క్రితమే పనులు ప్రారంభమైనా ఇంకా పూర్తికాని వైనం
- గత ఆగస్టులో మంత్రుల పరిశీలన, మూడు నెలల గడువు
- డెడ్‌లైన్ ముగిసినా కొనసాగుతూనే ఉన్న పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీరామనవమి సందర్భంగా దేశం నలుమూలల నుంచి జిల్లాకు వచ్చే భక్తులకు ఈసారి కూడా బస, వసతి కోసం ఇక్కట్లు తప్పేలా లేవు. భద్రాచలంలో గదులు దొరకని భక్తులు పాల్వంచ, కొత్తగూడెంలో కూడా వసతి కోసం వాకబు చేస్తారు. ఈ రెండు పట్టణాల్లో నిర్మిస్తున్న హరిత హోటల్, కిన్నెరసాని కాటేజీలు ప్రారంభిస్తే కనీసం వంద గదులు భక్తులకు అందుబాటులోకి వస్తాయి.

ముగ్గురు మంత్రులు వచ్చినా..

కిన్నెరసాని డ్యామ్ వద్ద ఏళ్ల తరబడి నిర్మాణ పనులు సాగుతున్న అద్దాల మేడ, రివర్‌వ్యూ కాటేజీలతో పాటు ఇల్లెందు క్రాస్‌రోడ్ దగ్గర 56 గదులతో నిర్మిస్తున్న హరిత హోటల్ పనులను గతేడాది ఆగస్టులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మూడు గంటలకు పైగా పరిశీలించారు. వరల్డ్ బెస్ట్ కన్సల్టెన్సీకి కిన్నెరసాని అభివృద్ధి పనుల ప్రణాళిక రూపొందించే పనిని అప్పగిస్తామన్నారు. ఈ పనులకు సాంకేతిక ఇబ్బందులు రాకుండా ఇరిగేషన్, అటవీ, విద్యుత్, పర్యాటకంతో పాటు ఇతర శాఖలను సమన్వయం చేస్తామని చెప్పారు. మూడు నెలల్లో కాటేజీలు, హరిత హోటల్ అందుబాటులోకి తెస్తామన్నారు. వారు నిర్దేశించిన గడువు దాటి.. మరో మూడు నెలలు కావస్తున్నా ఆ హామీలేవీ అమలుకు నోచుకోలేదు.

కానరాని కన్సల్టెంట్లు..

2023 డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక గతేడాది ఆగస్టు 12న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు కిన్నెరసాని ప్రాజెక్టును సందర్శించారు. డ్యామ్ మధ్యలో ఉన్న ఆనందద్వీపం వద్ద ఎకో టూరిజంలో భాగంగా చేపట్టబోయే పనులకు అంతర్జాతీయ స్థాయి కన్సల్టెంట్లను నియమిస్తామని ప్రకటించారు. ఇక తొమ్మిదేళ్లుగా నిర్మాణం జరుపుకుంటూనే ఉన్న అద్దాల మేడ, రివర్ వ్యూ కాటేజీలను 2024 నవంబర్ లేదా డిసెంబర్ నాటికి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.

సా..గుతూనే ఉన్నాయి..

భద్రాచలం వచ్చే రామభక్తులతో పాటు పారిశ్రామిక ప్రాంతాలైన కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరుకు అనుకూలంగా ఉండేలా ఇల్లెందు క్రాస్‌రోడ్ దగ్గర హరిత హోటల్, కాటేజీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులు ఏడున్నరేళ్ల క్రితం ప్రారంభించారు. రూ.15 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు నాలుగేళ్ల కిందటే పూర్తయ్యాయి. కేవలం విద్యుత్ కనెక్షన్, సీలింగ్, డెకరేషన్, ఫర్నిచర్, ఏసీల ఏర్పాటు పనులే మిగిలాయి. ఇలా ఐదేళ్లు దాటినా ఇప్పటికీ ఈ హోటల్ అందుబాటులోకి రాలేదు. గతేడాది ఏప్రిల్‌లో హరిత హోటల్‌లో ఈ పనులు మొదలుపెట్టారు. 2024 డిసెంబర్ నాటికి పూర్తి చేసి హోటల్ ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

అద్దాలమేడ అధోగతి..

సింగరేణి సహకారంతో కిన్నెరసాని బ్యాక్ వాటర్‌లో ఉన్న గుట్టపై 1980వ దశకంలో నిర్మించిన కాటేజీ అద్దాల మేడగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ సినిమా షూటింగ్‌లూ జరిగాయి. అయితే నక్సల్స్ దాడిలో కాటేజీ 90వ దశకంలో ధ్వంసం కాగా, దాదాపు పాతికేళ్ల నుంచి కిన్నెరసానిలో పర్యాటకులకు కాటేజీలు అందుబాటులో లేకుండా పోయాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత అద్దాలమేడతో పాటు తొమ్మిది కాటేజీలు, ఫుడ్ కోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 2015లో రూ.10.74 కోట్లు మంజూరు చేశాయి. అయితే పదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క కాటేజీ కూడా పర్యాటకులకు అందుబాటులోకి రాలేదు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు 2023 అక్టోబర్‌లో అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కాటేజీలు హడావిడిగా ప్రారంభించారు. అయితే అప్పటికీ అక్కడ సౌకర్యాలు ఏమీ లేకపోవడంతో పర్యాటకులకు వీటిని అందుబాటులోకి తేలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ వీటి నిర్మాణంపై ఇచ్చిన హామీల అమలు గగనంగా మారింది.



కిన్నెరసాని డ్యామ్ వద్ద అందుబాటులోకి రాని అద్దాలమేడ

నవమికి అందుబాటులోకి తెస్తాం

ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద నిర్మిస్తున్న హరిత హోటల్‌ను శ్రీరామనవమి నాటికి అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతం ఎలక్ట్రికల్‌తో పాటు ఇతర పనులను వేగంగా నిర్వహిస్తున్నాం. కిన్నెరసాని దగ్గరున్న అద్దాల మేడ, కాటేజీలు పూర్తయ్యాయి. వాటిని ఎకో టూరిజం విభాగానికి అప్పగించేందుకు ప్రతిపాదనలు పంపాం. వారు హ్యాండోవర్ చేసుకుని, వినియోగంలోకి తేవాల్సి ఉంది.

–రామకృష్ణ, టూరిజం శాఖ డీఈ

‘ఉద్యాన’ పరిశోధనలు పెంచాలి

డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ లక్ష్మీనారాయణ



అల్లిగూడెంలో బూడిద గుమ్మడి తోటను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

అశ్వారావుపేటరూరల్: ఉద్యాన పంటలపై పరిశోధనలను మరింతగా పెంచాలని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఆయన స్థానిక హెచ్‌ఆర్‌ఎస్‌తో పాటు మండలంలోని అల్లిగూడెంలో సాగు చేస్తున్న బూడిద గుమ్మడి, మునగ, మిర్చి పంటలను, దమ్మపేట మండలం లింగాలపల్లిలో మామిడి తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యాన తోటల పరిశోధనలకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యాన పంటల సాగులో పాటించాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక హెచ్‌ఆర్ఎస్‌లో జరిగిన వేలం పాటకు హాజరయ్యారు. ఉద్యాన పరిశోధన కేంద్రం ద్వారా సాగు చేస్తున్న మామిడి, జీడి మామిడి, కొబ్బరి, సపోటా, పనస తోటలకు వేలం నిర్వహించగా పలువురు వ్యాపారులు కైవసం చేసుకున్నారు. తద్వారా హెచ్‌ఆర్‌ఎస్‌కు రూ.10,78,500 ఆదాయం సమకూరినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్ కృష్ణ, డాక్టర్ కె నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం దొంగలదోపు జరిపించారు. తొలుత అర్చకులు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ఆరాధన గావించారు. ఆ తర్వాత చతుఃస్థానార్చన, నిత్యహవనం, పూర్ణాహుతి, ఉత్సవబలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ‘గుమ్మడి’ ప్రస్తావన

సీఎం అపాయింట్‌మెంట్‌పై మాట్లాడిన కూనంనేని

ఇల్లెందు: గత నెల 20వ తేదీన హైదరాబాద్ వెళ్లిన తనకు సీఎం అపాయింట్‌మెంట్ దొరకలేదని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆవేదన వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ ఘటనపై అసెంబ్లీలో శనివారం కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కమ్యూనిస్టులను కలవడం ఇష్టమేనని.. కానీ ఈ విషయంలో గ్యాప్ రాకుండా చూడాలని కోరారు. ఐదు దఫాలు ఎమ్మెల్యేగా పనిచేసిన గుమ్మడి నర్సయ్య వస్తే సీఎం కలవలేదని తెలిసి బాధనిపించిందని.. సీఎం కలిసి ఉంటే గౌరవంగా ఉండేదని పేర్కొన్నారు. ఈ అంశంపై సీఎం స్పందిస్తూ ఆ రోజు తన ఇంటి ముందు రోడ్డుకు ఆవల గుమ్మడి నర్సయ్య ఉండగా ఓ పిల్లాడు వీడియో తీసినట్లు తాను సాయంత్రం తెలుసుకున్నానని చెప్పారు. ఆపై తన పేషీ నుంచి గుమ్మడికి ఫోన్ చేయిస్తే అప్పటికే ఖమ్మం వెళ్తున్నానని చెప్పడంతో మరోసారి వచ్చినప్పుడు కలుస్తానని వెల్లడించానని తెలిపారు. ఐదు దఫాలు ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తిపై తనకు గౌరవం ఉంటుందని, కమూనిస్టులు తన సొంతం కోసం ఏమీ అడగరని రేవంత్ అన్నారు. అయినా చిన్న పొరపాట్లు ఉంటే సరి చేసుకుంటామని సీఎం తెలిపారు.

ఓటరు జాబితాపై అవగాహన ఉండాలి

రాజకీయ పార్టీల నేతలకు కలెక్టర్ సూచన



దమ్మపేట: పూసుకుంటలో ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాజకీయ పార్టీల నాయకులకు ఓటరు జాబితాపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం ఆయన ఐడీఓసీలో ఆయా పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతన ఓటర్ల నమోదు, జాబితాలో తప్పుల సవరణ, ఓటర్ల తొలగింపు తదితర అంశాలపై అవగాహన అవసరమని తెలిపారు. ఫామ్ 6 దరఖాస్తు ద్వారా కొత్తగా ఓటు కోసం, ఫామ్ 7 ద్వారా తొలగింపు, అభ్యంతరాలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా దరఖాస్తులను బీఎల్‌ఓలు విచారించిన తర్వాతే పేర్లు తొలగిస్తామని చెప్పారు. తప్పుల సవరణ, ఫొటో మార్పు, ఓటు బదిలీ తదితర సేవలకు ఫామ్ 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు కూడా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలన్నారు. పోలింగ్ బూత్‌లు, ఓటరు జాబితాలో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఫామ్ 6,7,8 లలో 19,514 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 10,944 దరఖాస్తులను పరిష్కరించామని, 1,310 దరఖాస్తులు తిరస్కరించామని, 7,260 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వివరించారు. నూతన ఓటుహక్కు రిజిస్ట్రేషన్, మార్పులు చేర్పుల కోసం ఎక్కడికీ తిరగాల్సిన అవసరం లేకుండా బీఎల్‌ఓ యాప్ ద్వారా అన్ని సేవలూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ యాప్‌పై వచ్చే శనివారం శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వంట చేసిన కలెక్టర్..

దమ్మపేట : ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్‌పై స్వయంగా వంట చేసిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కుక్కర్ వినియోగంపై ఆదివాసీ మహిళలకు అవగాహన కల్పించారు. మండలంలోని కొండరెడ్ల గ్రామమైన పూసుకుంటను శనివారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వినియోగం, వంట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణి తదితరులు పాల్గొన్నారు.

64మంది మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, పక్కన ఎస్పీ తదితరులు

- మిగిలిన వారూ జనజీవన స్రవంతిలో కలవాలి
- మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచన
- ఒక్కొక్కరికి రూ.25వేల సాయం అందజేత

కొత్తగూడెంటౌన్: ఆపరేషన్ చేయూతలో భాగంగా మావోయిస్టు పార్టీకి చెందిన 64 మంది మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట శనివారం లొంగిపోయారు. వారిలో 48 మంది పురుషులు, 16 మంది మహిళలు ఉన్నారు. ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.16లక్షల ఆర్థిక సాయాన్ని ఐజీ వారికి అందజేశారు. ఈ మేరకు హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూత కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని, దీనికి ఆకర్షితులైన మావోయిస్టులు లొంగిపోవడానికి మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రస్తుతం లొంగిపోయిన వారిలో బస్తర్ ఏసీఎం మడకం జిమ్మి అలియాస్ లక్ష్మి, పార్టీ క్రియాశీలక సభ్యులు 10 మంది, ప్రజా విప్లవ సంఘం సభ్యులు తొమ్మిది మందితో పాటు ఇతర అనుబంధ సంఘాల సభ్యులు ఉన్నారని వివరించారు. గత రెండున్నర నెలల్లో 122 మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. మిగితా వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆదివాసీ గిరిజనుల్లో మావోయిస్టులపై నమ్మకం, ఆదరణ సన్నగిల్లుతున్నాయని చెప్పారు. కాలం చెల్లిన సిద్ధాంతాలు అనుసరిస్తున్న మావోలు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, ఏజెన్సీ అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదనే కారణంతో అమాయక ఆదివాసీలను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలు వచ్చేలా పోలీసు యంత్రాంగం ఎప్పుడూ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్‌లు రితేష్‌ఠాకూర్, ప్రీత, రాజేష్ డోగ్రా తదితరులు పాల్గొన్నారు.

ఐజీకి ఘన స్వాగతం..

జిల్లా పర్యటనలో భాగంగా ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తొలుత ఇల్లెందు క్రాస్ రోడ్‌లోని సింగరేణి గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హేమచంద్రాపురంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజ్, షీ టీం ఎస్సై రమాదేవి ఆధ్వర్యంలో పోలీసులు ఘనంగా స్వాగతం పలికి పరేడ్ నిర్వహించగా, ఐజీ గౌరవ వందనం స్వీకరించారు.

ఎట్టకేలకు మోక్షం!

- 100 పడకల ఆస్పత్రి, ఐటీఐ నిర్మాణాలు
- పూబెల్లిలో 90 ఇందిరమ్మ గృహాలకు శంకుస్థాపన
- నేడు మంత్రి పొంగులేటి రాక



శంకుస్థాపన పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందు: పట్టణంలో ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలుగుతోంది. జేకే ఏరియాలో సింగరేణి క్వార్టర్లను కూల్చి పట్టణ నడిబొడ్డున 100 పడకల ఆస్పత్రితో పాటు ఐటీఐ నిర్మించనుండగా ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు పైలాన్ల నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. అనంతరం కోటిలింగాల క్రాస్ రోడ్ నుంచి మామిడిగుండాల వరకు రోడ్డు, రొంపేడు – రామగుండాల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన, మాణిక్యారం – కొమరారం – బోయితండా రోడ్డు పనులను ప్రారంభించనున్నారు. పోలారం పంచాయతీ ఇరుపవారి గుంపు – భద్రుతండా రోడ్డుకు. అనంతరం పూబెల్లిలో 90 ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఐటీఐతో నిరుద్యోగులకు మేలు..

ఇల్లెందులో ఐటీఐ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగనుంది. ఇందులో ఐదు ట్రేడ్‌లు నెలకొల్పనుండగా ఒక్కో ట్రేడ్‌లో 40 మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యేలా ఇప్పటికే ప్రిన్సిపాల్‌ను కూడా నియమించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదా వైటీసీలో ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఇంత కాలం డబ్బు చెల్లించి ఐటీఐ చేసే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఫీజుల భారం తప్పనుంది. ఎలక్ట్రీషియన్ కోర్సులో 2 యూనిట్లలో 40 మంది, ఫిట్టర్ రెండు యూనిట్లలో 40 మంది, ఐఓటీ స్మార్ట్ అగ్రికల్చర్ ఏడాది కోర్సుకు రెండు యూనిట్లలో 40 మంది, ఫ్యాషన్ డిజైనర్ టెక్నాలజీ రెండు యూనిట్లలో 40 మంది, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సు రెండు యూనిట్లలో 40 మంది చొప్పున విద్యార్థులకు తరగతులు బోధించనున్నారు.

ఆస్పత్రిలో పురోగతి ఇలా...

ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి వైద్య విధాన పరిషత్‌లోకి మారిన తర్వాత డాక్టర్లు, సిబ్బంది సంఖ్య పెరిగింది. పేషెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో 12 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఇక 100 పడకల ఆస్పత్రిగా మారితే సుమారు 30 మంది వైద్యులు, 60 మంది నర్సులు, 40 మంది ఇతర సిబ్బంది పనిచేసే అవకాశం ఉంది.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఇల్లెందురూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఇల్లెందులో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు ఇల్లెందు మండలం పూబెల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత ఇల్లెందు జేకే బస్టాండ్ వద్ద 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేయనున్న మంత్రి, అనంతరం బోయితండాలో బీటీ రోడ్డు, రొంపేడులో చెక్‌పోస్టు, కోటిలింగాలలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుండి బయలుదేరి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యే సభలో పాల్గొనేందుకు మంత్రి పొంగులేటి బయలుదేరతారు.

క్లుప్తంగా

సైలో బంకర్ సమస్య పరిష్కరించండి

సింగరేణి సీఎండీని కలిసిన ఎమ్మెల్యే

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని ఓసీల నుంచి బొగ్గు రవాణాకు ఏర్పాటుచేసిన సైలోబంకర్ ద్వారా స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్న నేపథ్యాన స్పందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. ఈమేరకు హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరాంను శనివారం కలిసిన ఆమె సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలు, కిష్టారం వాసుల దీక్షలపై వివరించారు. కాలుష్య ప్రభావంతో పలువురు మృతి చెందగా, బాంబ్ పేలుళ్లలో ఇళ్లు దెబ్బతిన్నందున బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య వినతితో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సింగరేణి ఓసీలు, సైలోబంకర్ ద్వారా ఎదురవుతున్న సమస్యలను శనివారం శాసన మండలిలో ప్రస్తావించారు.

రేపటి నుంచి స్పోర్ట్స్ స్కూళ్ల ప్రవేశాలకు ఎంపిక పోటీలు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని బాలుర, గుండాల మండలం కాచనపల్లిలోని బాలికల క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు సోమవారం డివిజన్‌స్థాయి ఎంపికలు నిర్వహించనున్నామని ఐటీడీఏ స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు శనివారం తెలిపారు. దమ్మపేట డివిజన్ పరిధిలోని అంకంపాలెంలో 17న, కమలాపురంలో 18న, భద్రాచలం డివిజన్‌లోని గొందిగూడెంలో 17న, ఆర్లగూడెంలో 18న, ఇల్లెందు డివిజన్ పరిధిలోని కాచనపల్లిలో 17న, బొజ్జాయిగూడెంలో 18వ తేదీన బ్యాటరీ టెస్టులు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికలకు వచ్చే విద్యార్థులు తమ వెంట స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌ఫొటోలు, టీషర్ట్, షార్టులు తెచ్చుకోవాలని సూచించారు.

108లో గర్భిణి ప్రసవం


కొత్తగూడెంఅర్బన్/పాల్వంచ రూరల్ : ఓ గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవించి, ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. పాల్వంచ మండలం జగ్గుతండాకు చెందిన జ్యోతి రామవరంలోని ఎంసీహెచ్‌లో ఇటీవల చేరింది. రక్తహీనత, అధిక రక్తపోటు కారణంతో వైద్యులు వరంగల్ ఎంజీఎంకు రిఫర్ చేయగా శనివారం చుంచుపల్లి 108 సిబ్బంది వరంగల్ తరలిస్తున్నారు. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువై అంబులెన్స్‌లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని, వారిని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించినట్లు 108 సిబ్బంది, ఈఎంటీ స్నేహ, పైలట్ హరిశంకర్ తెలిపారు.

ఇల్లెందు కోర్టు ఏజీపీగా అరుణ


వి.అరుణ


ఇల్లెందు: ఇల్లెందు కోర్టు ఏజీపీగా వి.అరుణను నియమించారు. 24 ఏళ్లగా ఇల్లెందు కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. దీంతో ఆమెను ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ప్రభుత్వం నియమించింది. తన నియామక ఆర్డర్ కాపీని కోర్టు న్యాయమూర్తికి అందజేసినట్లు అరుణ వెల్లడించారు. ఆమె వెంట సీనియర్ న్యాయవాదులు చెన్నకేశవరావు, బార్ అధ్యక్షుడు బి.రవికుమార్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


అజీజ్ మృతదేహం

ఇల్లెందు: పట్టణంలోని 17వ వార్డులో ఓ వ్యక్తి తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. షేక్ అబ్దుల్ అజీజ్ (40) ఇంట్లో మృతిచెంది ఉండటంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా విగతజీవిగా పడిఉన్నాడు. భార్య దూరంగా ఉండటంతో కొంతకాలంగా ఒంటరిగా ఉంటున్నాడు. రెండు రోజుల కిందట డ్యూటీకి వెళ్లి వచ్చి మద్యం మత్తులో డీహైడ్రేషన్‌కు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఎస్‌ఐ బి.సూర్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి


పొడియం సందీప్ (ఫైల్)

దమ్మపేట: బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గండుగులపల్లి శివారులో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన పొడియం సందీప్ (24) తన ఇద్దరు స్నేహితులు ఊకే రాజు, పొడియం బాబూరావుతో కలిసి బైక్‌పై శుక్రవారం రాత్రి సత్తుపల్లి మండలం బుగ్గపాడులో జరుగుతున్న జాతరకు వచ్చారు. అనంతరం తిరుగు ప్రయాణంలో బైక్‌ను సందీప్ అతివేగం, నిర్లక్ష్యంతో నడుపుతుండగా గండుగులపల్లి శివారులో అదుపుతప్పి కిందపడింది. సందీప్, రాజుకు తీవ్ర గాయాలు కాగా.. బాబూరావుకు స్వల్పగాయాలయ్యాయి. ఈ క్రమంలో బాబూరావు మిగతా ఇద్దరిని 108 ద్వారా సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. సందీప్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి వివాహం కాగా ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి తల్లి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

వేసవిలో వేటగాళ్ల ముప్పు

- వేటకు బలవుతున్న అడవి జంతువులు
- ప్రమాదకరంగా విద్యుత్ వైర్లతో జీవాల వధ
- జిల్లాలో నిత్యకృత్యంగా మారుతున్న వైనం
- నాలుగేళ్లలో 49 జంతువధ కేసులు నమోదు

జిల్లాలోని దట్టమైన అడవిలో పెరిగే వన్యప్రాణులు వేసవి కాలంలో ఆహారం లేదా తాగునీటి కోసం.. జనావాసాల వైపు వస్తుంటాయి. ఇలావచ్చే మూగ జీవులు వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. నదులు, చెరువులు, వాగుల వద్ద దట్టమైన పొదల్లో ఉరులు, ఉచ్చులను బిగించి వేటగాళ్లు వన్యప్రాణులను పొట్టన పెట్టుకుంటున్నారు. మరికొన్ని చోట్ల అత్యంత ప్రమాదకరమైన కరెంట్ వైర్ల సాయంతో జంతువులను వధిస్తున్నారు. దుండగులు వేటకు విద్యుత్ తీగలనే ఎక్కువగా వాడుతున్నారు. వీటితో మనుషుల ప్రాణాలకు సైతం ప్రమాదం పొంచి ఉంది. – చుంచుపల్లి

- 2021 డిసెంబర్‌లో దమ్మపేట మండలం రంగువారిగూడేనికి చెందిన ప్రొద్దుటూరి డానియేలు, రాకేశ్ తండ్రీకొడుకులు ఇద్దరు వేటకు వెళ్లి జంతువుల కోసం అమర్చిన అదే విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడిన ఘటన జిల్లాలో సంచలనమైంది.
- 2022 మార్చిలో కొత్తగూడెం పట్టణానికి చెందిన సునీల్‌కుమార్ చుంచుపల్లి మండలం పెనుబల్లి అడవి ప్రాంతంలో స్నేహితులతో కలిసి వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో జంతువుల వేటకు వేరొకరు అమర్చిన విద్యుత్ తీగలు తగలడంతో మృత్యువాత పడ్డాడు.
- 2023 మార్చిలో ఫారెస్ట్ స్పెషల్ టీం కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద పులి చర్మం అమ్మడానికి వెళ్తున్న తొమ్మిది మంది ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు.
- సుజాతనగర్ మండలం ఒడ్డుగూడెంలో కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృత్యువాత పడింది.


పులి చర్మంతో పట్టుబడిన ముఠా సభ్యులతో అధికారులు (ఫైల్)

గతంలో వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడి మాంసాన్ని అమ్ముతూ పట్టుపడిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. జంతువులను వేటాడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో వేటగాళ్లు జంతువుల కొమ్ములు, మాంసం, గోర్లు, చర్మాలు వంటి భాగాలను విక్రయిస్తున్నారు. జింకలు, అడవి పందులు, ముళ్ల పందులు, కొండ గొర్రెలు, ఎలుగుబంట్లు, దుప్పులు, ఉడుములు, నక్కలు, అడవిపిల్లులు, ముంగిసలు, ఇతర జంతువులకు జిల్లాలో దట్టమైన అటవీ ప్రాంతం అనువుగా ఉంది. అయితే, వేటగాళ్ల వల్ల రానురాను వీటి రక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. వేసవిలో వన్యప్రాణులను వేటాడే వేటగాళ్లను కట్టడి చేయకపోతే అడవి జంతువుల సంఖ్య కనుమరుగయ్యే ప్రమాదముందని జంతుప్రేమికులు వాపోతున్నారు.

వన్యప్రాణులను వధిస్తే కఠిన శిక్షలు

జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, కిన్నెరసాని వంటి ఆరు అటవీ డివిజన్ల పరిధిలో 10.45 లక్షల ఎకరాల అడవులు విస్తరించి ఉన్నాయి. అడవి జంతువులను పెంచుకోవడం, వేటాడటం వంటిది పూర్తిగా నిషేధం. మన పరిసరాల్లోనూ వాటిని మచ్చిక చేసుకోవడంతో పాటు మాంసం కలిగి ఉండటం నేరమని వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 చెబుతోంది. ఈ చట్టంలోనూ ఇటీవల కొన్ని మార్పులు చేశారు. జంతువులను వేటాడిన కేసులో నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. అవసరమైతే నేరాన్ని బట్టి ఈ రెండింటినీ అమలు చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. ఇక కొన్ని జంతువుల వేట విషయంలో నేరం జరిగితే బెయిల్ కూడా లభించదు. అంతరించిపోతున్న వన్యప్రాణుల రక్షణ అందరి కర్తవ్యం. గ్రామ పరిసరాల్లోకి అడవి జంతువులు వస్తే వాటికి హాని తలపెట్టకుండా సంబంధిత అధికారులకు తెలపాల్సి ఉంది. అడవులు, పొలాల్లో వేటకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం, ఉచ్చులు, వలలు అమర్చడం కూడా చట్టరీత్యా నేరం. అలాంటిది పచ్చని అడవుల్లో స్వేచ్ఛగా తిరగాల్సిన వన్యప్రాణులకు వేటగాళ్ల నుంచి ప్రమాదం ముంచుకొస్తోంది. వేసవి కాలం.. వన్యప్రాణులకు మరింత ప్రాణసంకటంగా మారుతోంది.

> ఇక జంతువులను వేటాడిన అంశంలో జిల్లాలో నాలుగేళ్లలో 2021-22లో 14, 2022-23లో 19, 2023-24లో 07, 2024-25లో 9 చొప్పున జంతు వధ కేసులు నమోదయ్యాయి.

వేటగాళ్లపై కఠినంగా వ్యవహరిస్తాం



వేసవి కాలంలో వన్యప్రాణులు నీళ్ల కోసం ఎక్కువగా చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వస్తూ ఉంటాయి. ఇది అదునుగా భావించి వేటగాళ్లు వాటిని హతమార్చేందుకు కరెంట్ తీగలు, ఉచ్చులు అమర్చుతుంటారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. నిరంతరం నిఘా పెట్టి పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించాం. అడవి జంతువుల వేటకు పాల్పడిన వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– కిష్టాగౌడ్, జిల్లా అటవీశాఖ అధికారి

తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతలు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి విద్యాచందన


ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో ఇంకుడు గుంత నిర్మాణాన్ని పరిశీలిస్తున్న విద్యాచందన

ఇల్లెందు/ఇల్లెందురూరల్: జలశక్తి అభియాన్ పథకం కింద అతి తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి విద్యాచందన కోరారు. శనివారం ఇల్లెందు మున్సిపాలిటీలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి లేకుండా తగిన ప్రణాళిక రూపొందించాలని, నీటి ఎద్దడిపై ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఇంటి పన్నులు వచ్చే 10 రోజుల్లో నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలి, డీఈ మురళి, ఏఈ, ఏఓ, ఆర్‌ఐ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కాగా, మండలంలోని సుదిమళ్ల, సుభాష్‌నగర్‌లలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ విద్యాచందన తనిఖీ చేశారు. నెలాఖరు నాటికి ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్, పంచాయతీ కార్యదర్శులు రజినీకాంత్, అజహర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం..

అడవిలో దర్శనమిచ్చిన విలువైన కార్డులు, ఉత్తరాలు


తిమ్మిరిగూడెం శివారులో పడి ఉన్న పలు కార్డులు

చర్ల: పోస్టల్ ఉద్యోగుల నిర్లక్ష్యంతో అందాల్సినవి అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నాట్లు తెలుస్తోంది. ఇలాంటి ఘటన మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. చినమిడిసిలేరు నుంచి తిమ్మిరిగూడెంనకు వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతంలో ఆధార్, పాన్, ఓటర్ ఐడీ కార్డులు, వివిధ కార్యాలయాల నుంచి వచ్చిన సర్టిఫికెట్లు పడి ఉండడాన్ని పశువుల కాపరులు గమనించారు. వారు మీడియాకు సమాచారం ఇవ్వడంతో ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా సుమారు 200కు పైగా పలు కార్డులు, సర్టిఫికెట్ల కవర్లు దర్శనమిచ్చాయి. ఇవి చినమిడిసిలేరుకు సమీపంలో ఉన్న బ్రాంచ్ పోస్టాఫీస్‌కు చెందినవని తేలగా.. అక్కడ పనిచేస్తున్న వారే వీటిని పడేసి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న పోస్టల్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకొని వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని చినమిడిసిలేరులోని బ్రాంచ్ పోస్టాఫీస్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఇంట్లో ఉండే వృద్ధురాలు.. పనికిరాని మందులతో పాటు పోస్టల్ బ్యాగులోని ఉత్తరాలు, కవర్లు, పలు గుర్తింపు కార్డులను చెత్త కాగితాలుగా భావించి పడేసినట్లుగా తెలిసింది. ఈ విషయమై సత్యనారాయణపురం సబ్ పోస్టాఫీస్‌కు చెందిన పోస్‌మాస్టర్‌ను వివరణ అడిగేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

మణుగూరురూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన శనివారం మండలంలోని పగిడేరు గ్రామంలో చోటుచేసుంది. గ్రామానికి చెందిన కుంజా కేశవరావు, కుటుంబ సభ్యులు రోజులాగానే పనులపై బయటికి వెళ్లారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగగా స్థానికులు అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. మాజీ సర్పంచ్ తాటి సావిత్రీ – భిక్షం దంపతులు స్థానికుల సాయంతో మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయినప్పటికీ పూరిల్లు మొత్తం దగ్ధమైంది. ఇంట్లోని దుస్తులు, విలువైన సామగ్రి కాలిబూడిదైంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

చెట్టును ఢీకొన్న కారు

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేట తండా – కొమ్ముగూడెం గ్రామాల మధ్య కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరు నుంచి ఖమ్మం వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ నరేశ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

లైంగికదాడికి యత్నించిన వ్యక్తి అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: గత నెల 10వ తేదీన కూలీ పని ఉందంటూ యువతిని ఆటోలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని అనిశెట్టిపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్లో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వివరాలు వెల్లడించారు. జూలూరుపాడు మండలం పాపకొల్లుకు చెందిన నర్సింహారావు.. కూలి పని ఉందని, అందుకోసం రూ.700 చెల్లిస్తానని చెప్పి ఇద్దరు మహిళలను మహబూబాబాద్‌లో గతంలో చోరీ చేసిన ఆటోలో ఎక్కించుకొని పాల్వంచ దగ్గరలోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న సమ్మక్క – సారక్క ఆలయం వద్ద ఓ మహిళను దించాడు. కూరగాలయలు తీసుకొస్తామని మరో మహిళను తీసుకొని అనిశెట్టిపల్లి అటవీ ప్రాంతానికి తీసువెళ్లి లైంగికదాడికి యత్నించాడు. మహిళ ఎదిరించడంతో జేబులో నుంచి కత్తి తీసి బెదిరించే క్రమంలో మహిళ చెంపకు గాయమైంది. దీంతో నర్సింహారావు ఆటోను అక్కడే వదిలేసి పారిపోయాడు. జల్సాలకు అలవాటు పడిన నర్సింహారావు హన్మకొండలోని కోర్టు పరిసరాల్లో ఉన్న ఆటో, అందులోని సెల్‌ఫోన్‌ను చోరీ చేసి, పాపకొల్లు వస్తూ మధ్యలో వినోబానగర్‌లోని ఓ ఇంట్లో సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. శనివారం ఇల్లెందు క్రాస్ రోడ్డు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నర్సింహారావును పోలీసులు పట్టుకుని విచారించగా చోరీల విషయం తెలిసింది. దీంతో నర్సింహారావు చోరీ చేసిన సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: ఓ పండ్ల వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. పట్టణంలోని ఫైర్‌కాలనీకి చెందిన నందిపాము మాణిక్యాలరావు(37) పండ్ల వ్యాపారంతోపాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం కిందట ఆయన భార్య సుధారాణి మనస్పర్థల కారణంగా సమీపంలో ఉన్న పేరాయిగూడెంలో ఉన్న పుట్టింటికి వెళ్లింది. తర్వాత భార్యను తిరిగిఇంటికి తీసుకొచ్చాడు. శుక్రవారం తెల్లవారుజాన ఇంట్లో నిద్రిస్తున్న భార్యను లేపి కడుపులో నొప్పి వస్తోందని, ఆస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకుంటానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం గాలించి, ఫలితం లేకపోవడంతో భార్య తన పుట్టింటికి వెళ్లింది. కాగా, శనివారం ఉదయం ఇంటి ఆవరణలో మాణిక్యాలరావు కింద పడి ఉండటాన్ని చూసిన చుట్టుపక్కల వారు భార్యకు ఫోన్ చేసి చెప్పారు. దాంతో ఆమె అక్కడికి చేరుకొని ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు సేవించి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన తోట సన్యాసమ్మ (45), భర్త బుచ్చయ్య దంపతులు ఐదేళ్లుగా ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం విజయరాయి గ్రామానికి చెందిన కౌలు రైతు శేఖర్ పొలంలో కాపలాఉంటూ, వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఇదే పొలంలో సన్యాసమ్మ కుమార్తె నారం మాధవి, అల్లుడు రామ్‌కుమార్ కూడా పని చేస్తున్నారు. కాగా, కొద్దిరోజులుగా తల్లి, కుమార్తె మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం ఉదయం కుడా తల్లి, కుమార్తె మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన సన్యాసమ్మ పురుగులమందు తాగగా అల్లుడు అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సన్యాసమ్మ మృతి చెందిందని ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి భర్త బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

మహిళతో సహచర ఉద్యోగి అసభ్య ప్రవర్తన

బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం జేఎఫ్‌సీఎం కోర్టు జూనియర్ అసిస్టెంట్, బెంచ్ క్లర్క్ సత్యనారాయణపై పోలీసులు కేసు నమోదు చేసిన అంశం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భద్రాచలం జేఎఫ్‌సీఎం కోర్టులో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న యువతిపై అదే కోర్టులో ఉద్యోగి సత్యనారాయణ కొంతకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తెలిసింది. ఈ క్రమంలోనే ఈ నెల 12న మధ్యాహ్నం ఆమె భోజనం చేసి చేతులు శుభ్రం చేసుకుంటుండగా ఆయన వెనుక నుంచి కొట్టాడని, అంతకుముందు కూడా ఆమె వాట్సాప్ స్టేటస్‌కు అసభ్యకరంగా రిప్లై ఇచ్చాడని మిగతా సిబ్బందికి చెప్పింది. ఈ మేరకు సదరు యువతి తన భర్త సహకారంతో భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా సత్యనారాయణపై టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు.

ముగ్గురిపై కేసు

చంద్రుగొండ: మండలంలోని బాల్యతండాలో హోలీ పండుగ సందర్భంగా జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ శనివారం రాత్రి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. బాల్యతండాలో మద్యం మత్తులో ఉన్న ఇస్లావత్ బన్నీ, ఇస్లావత్ వెంకన్న, ఇస్లావత్ పవన్‌కల్యాణ్ అదే గ్రామానికి చెందిన భూక్యా బాలాజీపై దాడి చేసి కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడిన వద్దిపర్తి శ్రీఅంజన

అశ్వాపురం: మండలంలోని మొండికుంట సెంటర్‌లో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులపైకి ఓ కారు దూసుకొచ్చింది. దీంతో ఇద్దరు గాయపడ్డారు. కొత్తగూడెం నుంచి మణుగూరు వైపు వెళ్తున్న కారు మొండికుంట గ్రామంలో నెల్లిపాకబంజర – భద్రాచలం సెంటర్‌లో వేగంగా దూసుకొచ్చి ఓ దుకాణం బోర్డు, బీఆర్‌ఎస్ దిమ్మె, మరో దిమ్మెను ఢీకొట్టి ప్రయాణికులపైకి దూసుకొచ్చింది. బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికుల్లో నెల్లిపాకబంజర గ్రామానికి చెందిన వద్దిపర్తి శ్రీఅంజన, తుమ్మలచెరువు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ మురళికి గాయాలయ్యాయి. మురళి కారు కింద పడగా ఎలాంటి ప్రమాదం జరగలేదు. శ్రీఅంజనకు కాలు విరిగింది. క్షతగాత్రులను 108 వాహనంలో భద్రాచలం తరలించారు. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్ల ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

నిల్వ ఉంచిన ఇసుక సీజ్


సీజ్ చేసిన ఇసుక వద్ద అధికారులు

పినపాక: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ నరేశ్ మాట్లాడుతూ.. మండలంలోని బయ్యారం క్రాస్‌రోడ్‌లో ప్రైవేట్ బంక్‌లో అక్రమంగా ఇసుక నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు దాడి చేశామని, సుమారు పది ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశామని తెలిపారు.

ప్రహరీ కూల్చిన మహిళపై కేసు

పాల్వంచరూరల్: తన ఇంటి హద్దులో ప్రహరీ నిర్మించారని ఆరోపిస్తూ.. ఓ మహిళ ఆ గోడను కూల్చింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కోడిపుంజులవాగు గ్రామానికి చెందిన కొర్ర కీమియా తన కుమారుడి వివాహం చేయడం కోసం ఇటీవల రూ.20 వేలతో ఇంటి చుట్టూ ప్రహరీ నిర్మించాడు. ఈ గోడ తన ఇంటి హద్దులో ఉందని బానోతు లక్ష్మి సుత్తితో ఈనెల 9వ తేదీన కూల్చింది. అంతేకాకుండా దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించిందని, చర్యలు తీసుకోవాలని కీమియా శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన లారీడ్రైవర్‌పై..

పాల్వంచరూరల్: ఎదురుగా వచ్చి స్కూటీని ఢీకొట్టిన లారీడ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పాల్వంచ పట్టణంలోని జాట్‌ఫాట్ రాములు కుమారుడు కార్తీక్ ఈనెల 7వ తేదీన భద్రాచలంలో పనిచేసి స్కూటీపై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఆర్‌టీఏ చెక్‌పోస్టు సమీపంలో భద్రాచలంవైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కార్తీక్ తండ్రి రాములు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా లారీడ్రైవర్ సత్తిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

ఈనాడు ఆస్తుల జప్తు

గూడవల్లి వద్ద ఉన్న ఆస్తులపై కోర్టు ఆదేశం

- ఆ ఆస్తులను ఎవరికీ బదలాయించరాదు
- తాకట్టుపెట్టడం, విక్రయించడం, బహుమతిగా ఇవ్వడం కుదరదు
- విజయవాడలో లీజు గడువు ముగిసినా ఖాళీ చేయని ఈనాడు
- స్థల యజమానికి రూ.5.2 కోట్లను 6 శాతం వడ్డీతో చెల్లించాలని గతంలో ఆదేశించిన కోర్టు
- పట్టించుకోని ఈనాడు యాజమాన్యం.. దాంతో ఈనాడు ఆస్తుల జప్తు కోరిన బాధితుడు
- గతంలో విశాఖ స్థల యజమానికీ ముప్పుతిప్పలు..
- కొనసాగుతున్న ఈనాడు దౌర్జన్యం.. కోర్టులు ఆదేశించినా లెక్కలేనితనం



సాక్షి, అమరావతి: అందరికీ నిత్యం ఉదయాన్నే నీతులు చెప్పే ఈనాడు (ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్) దౌర్జన్యం కొనసాగుతోంది. తమ పత్రిక ద్వారా జనాలకు నీతులు మాత్రమే చెబుతామని, వాటిని తాము మాత్రం ఆచరించమని ఈనాడు మరోమారు నిరూపించింది. గతంలో విశాఖపట్నం ఈనాడు కార్యాలయం స్థలం విషయంలో దాని యజమాని ఆదిత్య వర్మను ముప్పుతిప్పలు పెట్టిన ఈనాడు యాజమాన్యం, ఇప్పుడు విజయవాడలో ఉన్న కార్యాలయ స్థలం విషయంలో కూడా దాని యజమాని ముసునూరు అప్పారావును సైతం అలాగే ముప్పుతిప్పలు పెడుతోంది. ఈనాడు పత్రిక కోసం తీసుకున్న స్థలం లీజు గడువు ముగిసినా.. దాన్ని అప్పారావుకు అప్పగించకుండా చుక్కలు చూపిస్తోంది. కోర్టుకెళ్లి అప్పారావు విజయం సాధించినా.. న్యాయస్థానం ఆదేశాలను సైతం ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో కోర్టు ఈనాడు తీరును తీవ్రంగా ఆక్షేపించింది. స్థల యజమానిని వేధించడానికే ఆ స్థలాన్ని ఖాళీ చేయడం లేదని కూడా ఘాటుగా వ్యాఖ్యానించింది.

కాగా.. బాధితుడు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6 శాతం వార్షిక వడ్డీతో పరిహారం చెల్లించాలంటూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం ఈనాడు యాజమాన్యం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనాడు ఆస్తుల జప్తునకు న్యాయస్థానం తాజాగా ఆదేశాలు ఇచ్చింది. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు ఆస్తులను బదలాయించడం, తాకట్టు పెట్టడం, అమ్మడం, బహుమతిగా ఇవ్వడం చేయరాదని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ ఆస్తులను ఎవరూ కొనడం, బహుమతిగా తీసుకోవడం చేయరాదంది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంతవరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఈనాడు ఎండీ కిరణ్‌ను ఆదేశించింది.

అసలు కథ ఏమిటంటే..

ఈనాడు యజమాని రామోజీరావు 1975లో విజయవాడ పటమట లంకలో ముసునూరి అప్పారావుకు చెందిన 92 సెంట్ల స్థలాన్ని 33 ఏళ్ల పాటు లీజుకు తీసుకున్నారు. నెలకు రూ.725 అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ పక్కనే అప్పారావు సమీప బంధువైన వల్లూరు వెంకటేశ్వరరావుకు చెందిన ఎకరా 47 సెంట్ల భూమిని కూడా రామోజీరావు లీజుకు తీసుకున్నారు. లీజు గడువు 30.04.2008న ముగిసింది. దీంతో మరో 33 ఏళ్ల పాటు లీజు పొడిగించాలని స్థల యజమాని అప్పారావును రామోజీరావు కోరారు. రామోజీ సంగతి బాగా తెలిసిన అప్పారావు లీజు పొడిగింపునకు నిరాకరించారు. 6 నెలల్లో స్థలాన్ని ఖాళీ చేసి ఇవ్వాలని రామోజీరావుకు తేల్చిచెప్పారు. 6 నెలల గడువు 2008 అక్టోబర్‌తో ముగిసింది. అయినా రామోజీరావు ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. ఇదే సమయంలో మరో 33 ఏళ్లపాటు లీజు పొడిగించేలా అప్పారావును ఆదేశించాలంటూ విజయవాడ జిల్లా కోర్టులో రామోజీరావు సూట్ దాఖలు చేశారు. దానిని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 2013లో కొట్టేసింది. అప్పారావుకు చెందిన స్థలంపై ఈనాడుకు ఎలాంటి హక్కు లేదని తేల్చింది. అంతేకాక ఈనాడు ఆ స్థలంలో ఉండటం అక్రమమేనని స్పష్టం చేసింది. దీనిపై ఈనాడు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌ను సైతం కోర్టు కొట్టేసింది.

పరిహారంగా రూ.5.20 కోట్లు చెల్లించాలని కోర్టు ఆదేశించినా..

ఈ నేపథ్యంలోనే 2015లో ముసునూరి అప్పారావు తన స్థలం నుంచి ఈనాడును ఖాళీ చేయించాలని కోరుతూ విజయవాడ కోర్టులో సూట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు అప్పారావుకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దాదాపు 60 పేజీల తీర్పు వెలువరించింది. 2012–15 వరకు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6శాతం వార్షిక వడ్డీతో పరిహారంగా చెల్లించాలని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. మిగిలిన కాలానికి పరిహారం కోసం పిటిషన్ దాఖలు చేసుకునే వెసులుబాటును అప్పారావుకు ఇస్తూ 2024 అక్టోబర్ 3న తీర్పునిచ్చింది. అయితే.. ఈ తీర్పును ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో తీర్పు అమలుకు అప్పారావు కింది కోర్టులో ఈపీ దాఖలు చేశారు. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు కార్యాలయాన్ని జప్తు చేయాలని అందులో కోరారు. దానిపై విచారణ జరిపిన కోర్టు తాము ఇచ్చిన ఆదేశాల మేరకు రూ.5.20 కోట్ల పరిహారం చెల్లించడంలో ఈనాడు విఫలమైందని తేల్చింది. ఇందుకు గాను ఈనాడు ఆస్తుల జప్తునకు ఆదేశిస్తున్నట్టు ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ కిరణ్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిస్తూ విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది.

భారత్.. ఆధ్యాత్మిక స్ఫూర్తి

▶ మొదటి పేజీ తరువాయి

సూచించారు. ఆధ్యాత్మికాన్ని పెంపొందించడంలో బ్రహ్మకుమారీల పాత్ర అభినందనీయమన్నారు. మితిమీరిన 'ఇన్‌స్టంట్'కు అలవాటుపడితే అనారోగ్యాన్ని ఆహ్వానించినవారవుతారని హెచ్చరించారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి: జస్టిస్ ఎస్వీ భట్టి

న్యాయమూర్తులు, న్యాయవాదులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగినప్పుడే అసాధ్యాలు కూడా సుసాధ్యం కాగలవని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సారస వెంకటనారాయణ భట్టి చెప్పారు. న్యాయవాదులకు స్వీయ అవగాహన ఉండాలని, కేసును, కక్షిదారుడిని అర్థం చేసుకున్నప్పుడే సమర్థ వాదన సాధ్యపడుతుందన్నారు. గెలుపోటములను ఒకేలా స్వీకరించాలని.. అపజయానికి కుంగిపోవడం, విజయానికి పొంగిపోవడం వృత్తినే కాదు, వ్యక్తిత్వాన్నీ దెబ్బతీస్తాయని వ్యాఖ్యానించారు. ఏం చేస్తున్నాం.. ఎలా చేస్తున్నాం.. అనే సమీక్ష అందరికీ అవసరమన్నారు. వృత్తిపరంగా ప్రతికూల ఆలోచనలు వస్తుంటాయని.. కొన్నిసార్లు మనసు కలుషితం అవుతుందని చెప్పారు. సానుకూలత లేకుండా సరైన నిర్ణయం తీసుకోలేమని చెబుతూ.. జరిగిందేదో జరిగిపోయింది.. సానుకూలంగా ముందుకెళ్తాను అనే ధోరణిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ వి.ఈశ్వరయ్య, జస్టిస్ బీడీ రాథి, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ ఎం.రాజేందర్‌రెడ్డి, మాజీ అడ్వొకేట్ జనరల్‌లు దేశాయి ప్రకాశ్‌రెడ్డి, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

జీఎస్టీ.. దేశ ఆర్థిక చరిత్రలో ఓ మలుపు: గవర్నర్

వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రవేశపెట్టడం మన దేశ ఆర్థిక చరిత్రలో ఒక మలుపు అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. శనివారం తాజ్ దక్కన్ హోటల్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో జీఎస్టీ రూపకల్పనలో కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ పాత్రపై సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ మధ్య సమన్వయం అవసరమన్నారు. ఒకే దేశం.. ఒకే పన్ను విధానానికి జీఎస్టీ దోహదం చేసిందన్నారు. సాహసోపేతమైన సంస్కరణల మాదిరిగానే జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు అవాంతరాలు తప్పలేదని పేర్కొన్నారు. ఎక్కడైతే ప్రజలకు న్యాయం అందుతుందో.. అక్కడ ధర్మంతోపాటు రాజుకు బలమైన పునాది ఏర్పడుతుందని కౌటిల్యుడు చెప్పిన మాటలను ఉదహరించారు. పన్ను చెల్లింపుదారులందరూ ప్రభుత్వం అందిస్తున్న వన్ టైమ్ వడ్డీ మాఫీ పథకాన్ని ఈ నెల 31లోగా పన్ను చెల్లించి లబ్ధి పొందాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనర్ కె.హరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టి మాట్లాడారు. ఎఫ్‌టీసీసీఐ జీఎస్టీ కమిటీ చైర్మన్ మొహమ్మద్ ఇర్షాద్ అహ్మద్, బాంబే హైకోర్టు సీనియర్ న్యాయవాదులు లక్ష్మీకుమారన్, శ్రీధరన్ తదితరులు పాల్గొన్నారు.

హాజరు నుంచి హోంవర్క్ దాకా..



▶ మొదటి పేజీ తరువాయి

హాలిడేస్ లిస్ట్ వంటివి సైతం యాప్ ద్వారానే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ప్రతి విద్యార్థికి సంబంధించి కనీస సామర్థ్యాలు సాధించే దిశగా విద్యార్థి సూచిక (స్టూడెంట్ ప్రొఫైల్) ఉంటుంది. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన తీరు, పురోగతి సాధిస్తున్న అంశాలను ఇందులో పొందుపర్చనున్నారు.

పిల్లలు గైర్హాజరైతే వెంటనే మెసేజీ వస్తుంది



మా పిల్లలు ప్రభుత్వ స్కూల్‌లోనే చదువుతున్నారు. వాళ్లు స్కూల్‌కు వెళ్లకుంటే నా ఫోన్‌కు మెసేజీ వస్తుంది. ఇలా తల్లిదండ్రులకు విద్యార్థుల సమాచారం తెలపడం బాగుంది. టీచర్లు అసైన్‌మెంట్లను యాప్‌లో పెడుతుండటంతో.. పిల్లలు ఇంటికి వచ్చాక వారిని దగ్గరుండి చదివిస్తున్నాం. – ముక్కెర రమేశ్, విద్యార్థి తండ్రి

'స్థానిక' పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలి

- సీఎంకు తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్.. సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేసింది. గ్రామీణ ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది అని, స్థానిక ప్రజలకు పాలనలో భాగస్వామ్యం కల్పించే ఈ వ్యవస్థలో ముగ్గురి కంటే ఎక్కువ మంది పిల్లలున్న తల్లిదండ్రులు పోటీచేయలేకపోతున్నారని చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని వారు రాజకీయంగా వెనుకబడిపోతున్నారని ఒక ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న భావన ప్రజల్లో ఏర్పడినందున, తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత జనాభా పెంపుదలను ప్రోత్సహించే దశలో ఉన్నందున ఈ నిబంధనను ఎత్తేయాలని కోరారు.

చంద్రబాబుని మించిన అవకాశవాది పవన్: అంబటి



సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుని మించిన అవకాశవాది అని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సూపర్ సిక్స్, 143 హామీల అమలుపై జయకేతనం సభలో పవన్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. మెడికల్ కాలేజీలు, పోర్టులను చంద్రబాబు ప్రైవేటుకు ధారాదత్తం చేస్తుంటే ఎందుకు నోరెత్తడంలేదని అన్నారు. అంబటి రాంబాబు శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పైకి నిజాయితీపరుడినని చెప్పుకొనే పవన్‌కు జనసేన ఎమ్మెల్యేల దోపిడీ, అవినీతి, బెదిరింపులు కనిపించడం లేదని దుయ్యబట్టారు. పవన్‌కి ప్రియాతి ప్రియమైన మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ దోపిడీకి అడ్డే ఉండటంలేదని అన్నారు. నాయకులు ప్రజల నుంచే పుట్టాలని, వారసత్వ రాజకీయాలేమిటంటూ మాటలు చెప్పే పవన్.. వచ్చిన ఒక్క ఎమ్మెల్సీ పదవినీ అన్న నాగబాబుకే ఇచ్చుకున్నాడన్నారు. ఎన్నికల్లో గెలిపించే బాధ్యత నీదేనంటూ సీటు త్యాగం చేసిన వర్మతో పనిచేయించుకుని, ఆయన వల్ల గెలిచామంటే నీ ఖర్మ అంటూ ఆయన్ని ఎగతాళి చేశారని అన్నారు. అక్కర గడుపుకొని మోసం చేయడంలో, అవకాశవాదంలో చంద్రబాబునే మించిపోయారని చెప్పారు. 40 ఏళ్ల టీడీపీ పడిపోతుంటే నిలబెట్టామని మాత్రం పవన్ నిజం చెప్పారని తెలిపారు. ఇదే విషయాన్ని తాము మొదట్నుంచి చెబుతూనే ఉన్నామని తెలిపారు. పవన్ ప్రజల కోసం పోరాడే వ్యక్తి కాదని, చంద్రబాబుకు ఊడిగం చేయడానికి, టీడీపీకి బి టీమ్‌గా జనసేనను స్థాపించారని చెప్పారు.

'రాయలసీమ'పై కేంద్రం కొరడా

▶ మొదటి పేజీ తరువాయి

సైట్‌ను తనిఖీ చేశాక ఈ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరింది. డీపీఆర్ తయారీ ముసుగులో పర్యావరణానికి ఏదైనా హానీ చేసినట్టు తనిఖీల్లో గుర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చెప్పింది.

రాష్ట్ర ప్రభుత్వ విజయం: మంత్రి ఉత్తమ్

రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్రం పర్యావరణ అనుమతులు నిరాకరించడం రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయమేనని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టును అడ్డుకోవడానికి ఇప్పటికే ప్రభుత్వం కృష్ణా బోర్డు, ఎన్జీటీ, కృష్ణా ట్రిబ్యునల్–2, సుప్రీం కోర్టులను ఆశ్రయించిందన్నారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరుతూ తాను కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయగా, శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి లేఖ రాశారన్నారు.

జిల్లా వార్తలు

సింగరేణి ఆస్పత్రి సీఎంఓగా ఆర్మీ రిటైర్డ్ డాక్టర్

అక్రమాలకు చెక్ పెట్టేలా నిర్ణయం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ)గా ఆర్మీ రిటైర్డ్ డాక్టర్‌ను నియమించేందుకు రంగం సిద్ధమైంది. ఈ ఆస్పత్రి కేంద్రంగా మెడికల్ బోర్డు నిర్వహిస్తుండగా అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. దీంతో సీఎండీ ఎన్.బలరామ్ విచారణను ఏసీబీకి అప్పగించినా, దళారుల వివరాలు చెబితే నగదు బహుమతి ఇస్తామని ప్రకటించినా పెద్దగా ఫలితం కానరాలేదు. దీంతో మెడికల్ బోర్డ్‌ను పారదర్శకంగా నిర్వహించాలనే భావనతో ఆస్పత్రి బాధ్యతలు ఆర్మీ రిటైర్డ్ డాక్టర్‌కు అప్పగించాలనే యోచనకు వచ్చినట్లు సమాచారం. ఇందుకోసం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయగా 25వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశముంది. కాగా, 2014కు ముందు మెడికల్ బోర్డ్‌లో ఐదు విభాగాల అధికారుల కమిటీ దరఖాస్తు చేసుకున్న వారిని పరీక్షించి అన్‌ఫిట్ చేసేవారు. అయితే, 2018 నుంచి కార్పొరేట్ ఆస్పత్రి వైద్యుల ద్వారా పరీక్షలు చేయిస్తుండగా అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. దీంతోనే ఆర్మీ రిటైర్డ్ వైద్యాధికారిని నియమించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

జీఎంలకు ఈడీ హోదా..

సింగరేణిలో జీఎంలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) హోదా కల్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సీడీఎస్ హోదాలో ఉన్న ఒక జీఎంను కోల్ మూమెంట్ ఈడీగా నియమించారు. ఇదే సమయాన పర్సనల్, ఫైనాన్స్ విభాగాల్లో పనిచేస్తున్న జీఎంలకు సైతం ఈడీ హోదా కల్పిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే, ఒక్కో పోస్టుకు ఒక జీఎంను కేటాయిస్తే తప్ప న్యాయం జరగని పరిస్థితుల్లో ఒక్కొక్కరికి రెండేసి పోస్టులు ఇవ్వడమే కాక ఇప్పుడు ఈడీ హోదా కల్పించడం ఏంటనే విమర్శలు వస్తున్నాయి. గత 11ఏళ్లుగా పూర్తిస్థాయి డైరెక్టర్(పా)గా ఐఏఎస్ అధికారులను నియమించకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారిందని, రెండు, మూడు నెలలకోసారి గ్రీవెన్స్ కూడా జరగడం లేదని చెబుతున్నారు. ఈమేరకు యాజమాన్యం పూర్తి స్థాయి డైరెక్టర్(పా)ను నియమించి జీఎంల విషయంలోనూ పునరాలోచన చేయాలని కార్మికులు కోరుతున్నారు.

భూగర్భ గనులే కీలకం

- సింగరేణిలో 100 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదుపై దృష్టి
- ఇటీవల రీజియన్లలో పర్యటించిన ఉన్నతాధికారులు
- 'చైతన్య యాత్ర'ల పేరిట కార్మికులతో మమేకం



శ్రీరాంపూర్ భూగర్భగనిలో పరిశీలనకు వెళ్తున్న సీఎండీ, డైరెక్టర్లు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా త్వరలో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున కార్మికులు గైర్హాజరు కాకుండా, నెలకు 20 మస్టర్లు తగ్గకుండా పనిచేస్తూ ఆయా గనులు, డిపార్ట్‌మెంట్లకు నిర్దేశించి లక్ష్యాల సాధనకు కృషి చేసిన వారికి ప్రోత్సాహకాలు ప్రకటించింది. అంతేకాక డైరెక్టర్లతో సహా సింగరేణి సీఎండీ బలరామ్ శ్రీరాంపూర్, మందమర్రి, రామగుండం, భూపాలపల్లి, గోదావరిఖని, ఇందారం, న్యూటెక్ తదితర ఏరియాల్లోని భూగర్భ గనుల్లో పర్యటించి ఉత్పత్తిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉత్పత్తికి ఏమైనా అవాంతరాలు, ఇతరత్రా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. మిగిలిన తక్కువ సమయంలో లక్ష్యం మేర బొగ్గు ఉత్పత్తి సాధించాలని, ఉత్పత్తి చేసిన బొగ్గును రవాణా చేయాలని సూచించారు.

ఇంకా మిగిలే ఉంది..

సింగరేణిలో గత ఫిబ్రవరి 12వ తేదీ నాటికి 60.41 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 56.41 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారు. మిగిలిన సమయంలో 15.59 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉంది. ఈ ఉత్పత్తి కాస్త పురోగతిలోనే ఉన్నప్పటికీ లక్ష్యం మాత్రం చేరలేదు. ఇప్పటి వరకు భూగర్భ గనుల్లో 52.10 లక్షల టన్నులకు 40.58 లక్షల టన్నులు సాధించగా, ఓపెన్ కాస్ట్ గనుల్లో 55.18 మిలియన్ టన్నులకు 52.34 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదైంది.

ఈ ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి వరకు భూగర్భ గనుల్లో ఉత్పత్తి ఇలా..

ఏరియా	గని	లక్ష్యం (టన్నుల్లో)	ఉత్పత్తి (టన్నుల్లో)	శాతం
కొత్తగూడెం	పీవీకే-5	3,02,688	1,32,173	44
మణుగూరు	కొండాపురం	2,10,000	1,31,652	72
గోదావరిఖని	1, 3 ఇంక్లైన్	2,07,500	1,14,434	55
గోదావరిఖని	2, 2ఏ ఇంక్లైన్	2,42,625	1,16,489	48
గోదావరిఖని	11 ఇంక్లైన్	7,08,650	5,73,841	81
గోదావరిఖని	వకీల్‌పల్లి	3,02,685	3,15,104	104
భూపాలపల్లి	కేటీకే-1, 1ఏ	2,16,500	1,56,123	72
భూపాలపల్లి	కేటీకే -5 ఇంక్లైన్	2,17,000	1,74,238	80
భూపాలపల్లి	కేటీకే -6 ఇంక్లైన్	1,56,325	1,09,662	70
భూపాలపల్లి	కేటీకే -8, 8ఏ	2,43,350	1,59,833	66
అడ్రియాల	ఏఎల్‌పీ	3,86,515	3,86,515	100
మందమర్రి	కేకే -5 ఇంక్లైన్	1,73,000	1,76,912	102
మందమర్రి	కాసిపేట	2,08,125	1,26,230	61
మందమర్రి	కాసిపేట -2	1,73,000	95,546	55
శ్రీరాంపూర్	ఎస్కే	1,03,750	48,508	47
శ్రీరాంపూర్	ఆర్‌కే-5 ఇంక్లైన్	2,34,875	2,11,456	90
శ్రీరాంపూర్	ఆర్‌కే-6 ఇంక్లైన్	1,55,625	1,64,724	106
శ్రీరాంపూర్	ఆర్‌కే-7	3,11,250	2,64,343	85
శ్రీరాంపూర్	ఆర్‌కే రాంటెక్	1,38,375	1,64,724	106
శ్రీరాంపూర్	ఎస్‌ఆర్‌పీ -1	1,03,975	81,019	78
శ్రీరాంపూర్	ఎస్‌ఆర్‌పీ 3, 3ఏ	2,42,625	2,04,888	84
బెల్లంపల్లి	ఐకే-1ఏ ఇంక్లైన్	2,06,813	1,67,679	81

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ఈ ఏడాది కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యసాధన 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధనకు బదిలీ వర్కర్ నుంచి డైరెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి. గనుల్లో 100 శాతం ఉత్పత్తి సాధనకు సింగరేణి వ్యాప్తంగా భూగర్భ గనుల్లో కార్మిక చైతన్య యాత్రలు నిర్వహించాం. పోటీ ప్రపంచంలో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించి, ఉత్పత్తికి డిమాండ్ పెరిగేలా చూడాలి. ఉత్పత్తితో పాటు రక్షణకూ ప్రాధాన్యమిస్తూ ప్రమాద రహిత సింగరేణిగా కీర్తి గడించాలి. – ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

నిల్వ పంటకు రుణ సౌకర్యం

- పంట తాకట్టుపై విలువలో 75శాతం మేర రుణాలు
- ఆరు నెలల పాటు వడ్డీ మినహాయింపు
- ఖమ్మం జిల్లాకు రూ.10.30 కోట్ల నిధులు



కోల్డ్ స్టోరేజీలో నిల్వకు రైతులు తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: పంటకు గిట్టుబాటు ధర లేని పరిస్థితుల్లో నిల్వ చేసి రుణం పొందే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. 'రైతు బంధు' పేరిట ఈ పథకాన్ని మార్కెటింగ్ శాఖ ద్వారా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఈ ఏడాది ఖమ్మం జిల్లాకు రూ.10.30 కోట్ల నిధులు కేటాయించింది. 2013–14 నుంచి ఈ పథకం అమలులో ఉన్నా అంతగా ఆదరణ లభించడం లేదు. తొలుత కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించిన పంటలకు మాత్రమే పథకాన్ని అమలు చేయగా, కరోనా సమయంలో మిర్చి రైతులకు ఉపయోగపడింది. 2020–21లో అత్యధికంగా జిల్లాలో 1,513 మంది రైతులు మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి రూ.1,732.52 లక్షల మేర రుణం పొందారు. కాగా, ప్రభుత్వం ధాన్యం, మొక్కజొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తుండడంతో రైతులకు అవసరం రాకపోగా, పత్తి పంటకు మాత్రం అవకాశం లేదు. ఇక గత ఏడాది మిర్చికి మంచి ధర ఉండటంతో కేవలం 36 మంది రూ.65 లక్షలను రైతుబంధు పథకం కింద రుణం తీసుకున్నారు. ఈ ఏడాది మాత్రం మిర్చి ధర బాగా పతనమైన నేపథ్యాన రైతులు 'రైతుబంధు'ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు..

మార్కెట్ల వారీగా నిధుల కేటాయింపు

రైతుబంధు పథకానికి మార్కెటింగ్ శాఖ వ్యవసాయ మార్కెట్ల వారీగా నిధులను మంజూరు చేసింది. ఖమ్మం జిల్లాలోని ఎనిమిది మార్కెట్లకు గాను ఏన్కూరు మినహా మిగిలిన ఏడింటికి నిధులు అందాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రూ.5 కోట్లు, వైరాకు రూ.3 కోట్లు, మధిరకు రూ.కోటి, మద్దులపల్లికి రూ.50 లక్షలు, కల్లూరుకు రూ.50 లక్షలు, నేలకొండపల్లికి రూ.20 లక్షలు, సత్తుపల్లి మార్కెట్‌కు రూ.10 లక్షలు కేటాయించగా మద్దులపల్లి మార్కెట్ పరిధిలో 33 మంది రైతులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

రూ.2 లక్షల రుణం.. ఆరు నెలలు వడ్డీ మినహాయింపు

పంట నిల్వ ఆధారంగా ఒక్కో రైతుకు రూ.2 లక్షల మేర రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. రుణం కావాలనుకునే రైతులు పంటను గోదాంలు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి ధ్రువపత్రాలు సమర్పిస్తే అధికారులు ధర ఆధారంగా 75 శాతం మేర రుణంగా చెల్లిస్తారు. ఇది అత్యధికంగా రూ.2 లక్షల వరకు ఉంటుంది. ఇక రుణాలకు ఆరు నెలల వరకు ఎలాంటి వడ్డీ ఉండదు. 180 రోజుల నుంచి 270 రోజుల వరకు 12 శాతం చొప్పున వడ్డీ వసూలు చేస్తారు. 270 రోజుల్లో రుణం చెల్లించి పంట తీసుకోకపోతే వేలంలో విక్రయించి వచ్చే నగదును మార్కెటింగ్ శాఖ జమ చేసుకుంటుంది. అంతేకాక నిల్వ చేసిన పంటకు బీమా సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి



పండించిన పంటలను గోదాంలు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి రైతుబంధు ద్వారా రుణాలు పొందొచ్చు. పంట ధరల ఆధారంగా 75 శాతం మేర రుణంగా అందిస్తాం. గతంలో ధాన్యానికే వర్తింపజేసిన ఈ పథకాన్ని కరోనా తర్వాత మిర్చి పంటకు కూడా వర్తింపజేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – ఎం.ఏ.అలీం, ఖమ్మం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

వేగంగా మ్యాన్‌రైడింగ్ పనులు

- త్వరలోనే కేపీయూజీ మైన్‌లో అందుబాటులోకి...
- తీరనున్న కార్మికుల కష్టాలు



కేపీయూజీ గనిలో జరుగుతున్న మ్యాన్ రైడింగ్ పనులు

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గని(కేపీయూజీ)లో మ్యాన్ రైడింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మరో పది రోజుల్లో మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి రానుండగా, కార్మికుల ఇక్కట్లు తీరనున్నాయి. ప్రస్తుతం రోజుకు 1.2 కి.మీ. మేర గనిలోకి నడిచి వెళ్లాల్సి రావడంతో కార్మికుల పని గంటలపై ప్రభావం పడుతోంది. దీంతో ఆంధ్రప్రదేశ్ మిషనరీ హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎంఈహెచ్‌ఎల్) ఆధ్వర్యాన చేపట్టిన మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి వస్తే అటు కార్మికుల ఇక్కట్లు తీరతాయని.. ఇటు ఉత్పత్తి మెరుగవుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ పనులు చాన్నాళ్ల క్రితమే పూర్తి కావాల్సి ఉన్నా డిసెంబర్‌లో ఏర్పడిన బుంగల కారణంగా ఆలస్యమైంది.

పెరగనున్న ఉత్పత్తి

ఆది నుంచి రకరకాల కారణాలతో అవరోధాలు ఎదురవుతుండగా, బొగ్గు ఉత్పత్తి కోసం అధికారులు అవస్థలు పడుతున్న నేపథ్యాన కేపీయూజీ మైన్‌లో మ్యాన్ రైడింగ్ పూర్తయితే ఉత్పత్తి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఇక్కడ లభించే జీ–6 గ్రేడ్ బొగ్గుకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి రాగానే కార్మికుల పనిగంటలు పెరుగుతాయని, తద్వారా నిర్దేశిత లక్ష్యాలు సునాయాసంగా సాధించొచ్చని చెబుతున్నారు.

లక్ష్య సాధనకు కృషి

గతంలో కోల్‌సీమ్స్ కారణంతో ఎస్‌ఎంఎస్ పనులు ఆగిపోవడం, ఆపై గని అంతర్భాగంలో బుంగ ఏర్పడడం వంటి కారణాలతో నిర్దేశిత లక్ష్యాలకు చేరువగా ఉత్పత్తి నమోదవుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే లక్ష టన్నుల లక్ష్యానికి మించి అదనంగా 41వేల టన్నులు ఉత్పత్తి సాధించారు. ప్రస్తుతం అధికారుల ప్రత్యేక దృష్టితో ఉత్పత్తి లక్ష్యాలు క్రమక్రమంగా పెంచుతూ ఈ ఏడాది 2.10లక్షల టన్నులుగా నిర్దేశించారు. అయితే, డిసెంబర్, జనవరిలో బుంగ ప్రభావం చూపినా, ప్రస్తుతం రోజుకు 500 టన్నుల బొగ్గు వెలికితీస్తున్నారు. దీంతో లక్ష్యంలో 1.60లక్షల టన్నుల మేర నమోదయ్యే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. కాగా, మరో ఇరవై ఏళ్ల భవిష్యత్ ఉన్న కేపీయూజీలో మైన్ రైడింగ్ అందుబాటులోకి రానుండడంపై కార్మికులు, యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో అందుబాటులోకి...



త్వరలోనే మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి వచ్చే అవకాశముంది. తద్వారా గనిలో ఉత్పత్తి సామర్థ్యం పెరిగి లక్ష్య సాధన సులువవుతుంది. ఇక భూగర్భ గనిలో నీరు ఊబికిరావడం సాధారణమే అయినా బయటకు పంపింగ్ చేస్తూ ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూస్తున్నాం. – దుర్గం రాంచందర్, ఏరియా జీఎం